# ఎంత కురుపుకి అంత సలుపు

'ఈ జెయిలరుగాడికి ఎలా బుద్ధి చెప్పాలి?'

అని బుఱ్ఱ బద్దలు కొట్టుకుంటున్నాడు, మినిస్టరు బసివిరెడ్డి.

"ఈ మంత్రిగారికి ఎలా గడ్డి పెట్టాలి?" అని గింజుకు చస్తున్నాడు జెయిలర్ ఆంజినాయుడు.

*　　*　　*

అవి ఎమర్జన్సీ రోజులు. అదొక సబ్ జెయిలు.

తెల్లవారుజామున ఒంటి గంటా మూడు గంటల మధ్య జరిగిన ఆనాటి పదవీ బదలీ మహోత్సవంలో ఓ భాగంగా బసివిరెడ్డి అక్కడ చేర్చబడ్డాడు. అది చెరకాదు. అంతఃపుర అర. అయినా మనిషికి తృప్తి నిచ్చేది, బసివిరెడ్డి దృష్టిలో అక్కడ లేదు.

మనకంటె బలవంతులమీద ఎలాగా దెబ్బ తియ్యలేము, కిందవాళ్ళ నేనా కాల్చుకు తినకపోతే యెందుకీ వెధవ బతుకు? ఇది ఉగ్గుపాలతో అతనికి అబ్బిన విద్యే.

ఆ చిన్నతనపు రోజుల్లో ఏం జరిగేది?

ఎందుకో అందుకు ఉన్నట్టుండి వాళ్ళ అమ్మ నాన్నని దుమ్మెత్తి పోసేది.

నాన్న పెద్దక్కమీద విరుచుకుపడేవాడు.

పెద్దక్క అన్నయ్య చెవి నులిమేది.

అన్నయ్య అకారణంగా తన గూబ గుయ్యమనిపించేవాడు.

తను?

ఏ కుక్కమీదకో గురి చూసి రాయి విసిరేవాడు.

అది పిల్లిమీదికి దుమికేది.

పిల్లి ఏ తొండనో తరిమేది.

తొండముండ ఏ ఈగనో పట్టుకునేది.

ఇలా ఎంతైనా చెప్పొచ్చు. ఈ 'నిత్య చైతన్యధారకి' అంతెక్కడ? అనుకున్నాడు బసివిరెడ్డి.

మంత్రిపదవి అంటే మాటలా?

నెల నెలా తిరుపతి వెళ్ళి నీలాలు సమర్పించి రాక తప్పదుగదా! అదేం తక్కువ త్యాగమా? అన్నిసార్లు అంత మంట భరిస్తున్నాడే, ఇదంతా ప్రజలకి సరఫరాచేసి దైవ రుణం తీర్చుకోవద్దూ!

బసివిరెడ్డి అలవాటు పడింది కర్ర పెత్తనానికి. ఎక్కడైనా అతను కోరుకునేది ఎదుటివాడి మీద కళ్ళెర్ర చెయ్యటం అనే వరం. ఈ దేశపు ప్రజలు కళ్ళెదురుగా వున్నదాన్ని గుర్తించరు, గౌరవించరు. వీరి సర్వ సంస్కృతికీ అదృశ్యశక్తి అనేదే ఆరంభం, ఆధారం. అందుకని తన్నెం దుకు యెరష్టు చేశారో అని ఎప్పుడూ ఆలోచించలేదు బసివిరెడ్డి, ఈ ప్రజలు తనని ఎందుకు యెన్నుకున్నారో ఆనాడు తెలిసి చచ్చింది గనకనా? అందుకు కాదు. తన ఏడుపు. గట్టిగా దెబ్బలాడదామంటే ఓ మనిషి లేకపోతే యింకేం చూసుకు బతకడం ఈ దిక్కుమాలిన జెయిల్లో! ఎలా తీరేను ఈ దురద!

ఇక ఏ సదుపాయం వుంటే ఏం లాభం ఈ లోటు తీరక పోయాక!

ఈ 'జెయిలు రికార్డు' అనేది ఊరికే పోదని బసిపిరెడ్డికి స్పష్టంగా తెలుసు. చాలామంది దేశనాయకులకు ఈ జెయిలు వాళ్ళకే తెలియని యెన్నో యోగ్యతా పత్రాలు పంచిపెట్టి, ఆ పెట్టుబడితో రాజకీయ వ్యాపా రస్థులుగా తీర్చిదిద్దిన మాయా మహలు ప్రభుత్వం మీద అతనికి కోపం తేధు. ఐతే యెవరిమీదా కోపం చూపించకుండా రోజులు యెలా గడ పడమా అనేదే అతని ప్రస్తుత సమస్య. ఓసారి అన్నం తెచ్చిన వార్డరు మీద ఏదో వంకపెట్టి రంకె వేశాడు. వాడు ఈ వుప్పు అంజినాయుడికి అందించాడు.

జెయిలరు అంజినాయుడికి పాపం బొత్తిగా పెద్దమనిషని పేరు. తీరా పేరు వచ్చేశాక ఆ మేరకి త్యాగం చెయ్యక తప్పదు గదా, ప్రజా ప్రభుత్వం అన్న తర్వాత! తను వేరూ ఖైదీలు వేరూ అనుకోవడం అతని కెలా కుదురుతుంది? ఇంట్లో ప్రతీ పనీ వాళ్ళచేతే ఎంతో సమదృష్టితో సంతుష్టితో చేయించుకుంటాడు. వాళ్ళకి సప్లయి అయినట్టు లెక్కలోకి ఎక్కిన బియ్యం, పప్పూ, నూనే, బట్టా, పంచదారా, కిరసనాయిలూ ఇలా ప్రతి సరుకూ దొంగలూ దొరా అనే భేదం లేకుండా విశాల దృష్టితో వాళ్ళతో పంచుకుంటాడు.

తను మాత్రం ఇలా చల్లగా ఎదుటివారి కాలం చెల్లగా గడుపుతున్న అంజినాయుడికి బసివిరెడ్డి పొగరుమోతుతనం ఒళ్ళు మండించింది. వార్డరు అలా చెప్పగానే ఓ దులుపు దులిపేడు.

"చూడు మంత్రిబాబూ....ఇది నీ సొంత యిల్లు కాదు. ఈ కుర్రాడు నీ సొంత బావమరిది కాడు. కొంచెం సొంత గొంతుక తగ్గించుకో మరి, సొరకాయలా ఎగిరిపోగలవు—ఈ ఎమర్జన్సీలో మా పవర్సు నువ్వు వినలేదు కాబోలు మరి..."

బసివిరెడ్డి కుత కుత వుడికిపోయాడు.

"మినిష్టర్ అనేవాడు కాల్ బుక్ చేస్తే చాలు కాలువ వొడ్డుకి పరిగెత్తే ఆఫీసరు ముసాఫిర్లు, వీళ్ళా నన్ను మందలించడం!"

"కబురందకుండానే కైమాచేసి పారేస్తున్నారు ఖైదీగాళ్ళని. ఇంకా ఎందుకో చచ్చినాడికి తుళ్ళిపాటు!"

అంజినాయుడు బుస బుస పొంగిపోయాడు. అంతలో టక్కున అతనికో ఆలోచన వచ్చింది. సాలుకి మూడు పంటలు పండే ఓ యాభై ఎకరాల పొలం తను చేరెయ్యలేక పోలేదు గాని ఈ రోజుల్లో అది ఏ మూల? ఉద్యోగం ఉండగానే ఊరు కొల్లగొట్టాలి. హైదరాబాదులాంటి సిటీలో ఓ రెండు సొంత సినిమాహాల్సయినా లేపందే ఈ గడ్డుకాలంలో ఏం వెళతాయి నోట్లోకి నాలుగు వేళ్ళు! ఏ మెట్టు ఎక్కాలన్నా యెమర్జన్సీయే దిక్కు. ఇది ఉండగానే ప్రమోషన్ మీద ట్రాన్స్‌ఫర్ కొట్టెయ్యాలి. ఈ మంత్రిగాడిమీదే ఏదో మంత్రం వేసి దాన్ని సాధించాలి.

అతని మనసులోది కనిపెట్టినట్టు బసివిరెడ్డి అడిగాడు.

"ఒక చిన్న రిక్వెస్టు సార్!"

విన్నట్టు నటిస్తూ చెవి అటు పారేశాడు అంజినాయుడు.

"లోపలకూచుంటే బొత్తిగా తోచడం లేదండీ....ఎక్సర్ సైజులేక తిన్నది అరిగిచావడం లేదు."

"అయితే?" అన్నట్టు కోపంగా చూశాడు.

"ఓ గంట రోజూ గార్డెనింగ్ చేసుకో నివ్వండి. ప్లీజ్! చుట్టూ బార్బ్డ్ వైరువుండనే వుందికదా.. నే నెక్కడికి పారిపోగల్ను?"

"బి ఇన్ యువర్ లిమిట్స్" అంటూ టక టక నడచి వెళ్ళి పోయాడు అంజినాయుడు కోపంగా. వారం పది రోజులు బతిమాలించు కొని అప్లికేషన్ పెట్టుకోడానికి అనుమతి ప్రసాదించాడు. మరో పది రోజులకి అతి కష్టంమీద పెర్మిషన్ పుట్టించినట్టు నటించాడు.

మర్నాటినుంచి మంత్రిగారు గోతులు త్రవ్వడం ప్రారంభించారు. ఆ విద్యలో దేశానికి వారు ఆదర్శప్రాయులు కదా!

అతను తోట పని చేస్తున్నంత సేపూ తుపాకీతో గార్డు కాపలా ఉండడానికి ఏర్పాటు జరిగింది.

పక్కని గార్డు ముండాకొడుకు; పైకి తిట్టుకోడానికి కూడా వీలు కాని గ్రహచార మహర్దశ. మౌనంగానే మనిషన్న ప్రతి ఒక్కరినీ మనసు దీరా శపిస్తూ, తోటపని చేస్తున్నంత సేపూ యెంతోకొంత రిలీఫ్ పొందేవాడ తను.

బసివిరెడ్డి కేసు హిస్టరీ జాగ్రత్తగా పరిశీలించాడు అంజినాయుడు. అలా శుద్ధ ఖద్దరులో కనబడుతున్నాడనా, అమ్మో, పరిశుద్ధ పిన్నరు! వీడి పార్టీ, కేంద్రానికి పక్కలో బుల్లెట్ట. ఇలాంటివాణ్ని హింసించినట్టు రుజువు ఉంచుకుంటే తనకెంత లాభం!

అంజినాయుడు యింక ఆలశ్యం చెయ్యలేదు. చెయ్యి తిరిగిన ఫోటోగ్రాఫర్ని ఒకణ్ణి వెంటనే పిలిపించాడు. బసివిరెడ్డి తోటపని చేస్తూం డగా అరడజను భంగిమల్లో ఫోటోలు తీయించాడు.

"నాకూ ఓ రెండు కాపీలు పారేయించండి" అని అతను అడిగితే యిచ్చాడు. ఇస్తూ నవ్వుకున్నాడు. 'కేంద్రంలో వున్న పార్టీ ఎలాగా కంటిన్యూ కాక తప్పదు. ఇంక ఇలాంటి రాజకీయ ఖదీలకు విడుదల

అనేది యింకో జన్మలోనే. వెర్రి పీనుగని పాపం ఫోటోలయినా చూసు కుని అందాకా మురిసిపోనియ్యి. ఇంత పలుకుబడి వున్న నాయకుడిచేత పని చేయించిన కీర్తి నాదికాక మరెవరిది? ఎంత చెప్పినా మొండికేశాడనీ, పక్కన మనిషిని పెట్టి బెదిరించి చేయించాననీ వాడూ, గార్డుగాడూ, నేనూ వున్న ఫోటో చూపెడతాను. ప్రమోషన్ ఖాయం కాదా మరి?'

అంజినాయుడి ఆశ ఏమయిందోగాని శ్వాస మాత్రం ఆగిపోయే స్థితికి చేరుకుంది.

ఎమర్జన్సీ తెర ఎత్తేశారు.

ఎన్నికల నాటకం ప్రారంభమైంది.

నారాయణాస్త్రం ముందు ఇంద్రజాలం ఓడిపోయింది. రాజకీయ రంగస్థలం మీదకి కొత్త వేషాల గుంపు దిగింది.

బసివిరెడ్డి యెన్నికల్లో గెలిచాడు.

మళ్ళీ పదవిని దక్కించుకున్నాడు. వడ్డీతో సహా ప్రజల్ని ముప్పు తిప్పలు పెడుతున్నాడు. ఎమర్జన్సీలో జరిగిన అత్యాచారాల పేరిట ఎన్నెన్నో కమిటీలు వెలిశాయి. బసివిరెడ్డి అంజినాయుడి మీద ఫిర్యాదు చేశాడు. అతని కంప్లెయింటు ఇది.

"ఏ క్లాసు జెయిలు అన్నారు. యెండు గడ్డి అయినా పెట్టేరు కారు. తనకెంతో జబ్బు చేసినా ఆలనా పాలనా లేదు సరికదా ఆ రోజుల్లోనే తుపాకీ గురిపెట్టి తన చేత వెట్టిచాకిరీ చేయించారు. ఇవిగో ఫోటోలు."

ప్రతీ పత్రికా యెంతో ఆసక్తితో అవి ప్రకటించింది.

అవి చూసి ఎందరో జాలిగుండెగలవాళ్ళు తెలివితప్పి పడిపోయారు. అలాంటివాళ్ళ లిస్టులో అంజినాయుడిది మొదటి స్థానం.

అతని ఆస్తి ప్రభుత్వం జప్తు చేసింది. అతన్ని సస్పెండు చేశారు.